

'మధ్యాహ్న' కార్మికులకు ఊరట

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వడ్డించే కార్మికుల వేతనాలు పెంచుతూ ప్రభుత్వం తీపి కబురు అందించింది. 8లో▸



సదుపాయాలకు మంగళం

జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు పని చేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. 8లో▸



ఆధారాలతో ఫిర్యాదు చేయండి

భూ సమస్యలకు సంబంధించిన పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు. 9లో▸

న్యూస్‌రీల్

హుండీ ఆదాయం రూ.4.18 లక్షలు



నగదును లెక్కిస్తున్న సభ్యులు

బొంరాస్‌పేట: దుద్యాల మండలం పోలెపల్లి ఎల్లమ్మ దేవాలయం హుండీని సోమవారం ఆలయంలో లెక్కించారు. ఈనెల 9 నుంచి 12వరకు నాలుగు రోజుల పాటు జరిగిన అమ్మవారి జాతరలో భక్తులు అమ్మవారికి నగదు రూ.4,18,790, వెండి 200గ్రాములు సమర్పించుకున్నారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ముచ్చటి వెంకటేశ్, మేనేజర్ రాజేందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు బుగ్గప్ప, సురేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అదనపు జడ్జిగా చంద్రకిశోర్ బాధ్యతలు



అడిషనల్ జడ్జి చంద్రకిశోర్‌కు బొకే అందజేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

అనంతగిరి: వికారాబాద్ జిల్లా ఒకటో అదనపు న్యాయమూర్తిగా చంద్రకిశోర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సుదర్శన్‌ను కలిశారు. జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు అడిషనల్ జడ్జికి పూల బొకే అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, పీపీలు అశోక్‌కుమార్, అన్వేష్ సింగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.జగన్, సీనియర్ న్యాయవాదులు లవకుమార్, బస్వరాజు, గోవర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సంపూర్ణానంద్, యాదవ రెడ్డి, వసుంధర, బందయ్య, రమేశ్, శ్రీనివాస రావు, బాలయ్య తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ చైతన్యం

చెత్త పారబోత, పరిసరాల శుభ్రతపై పల్లెల్లో మార్పు

- ఆరు బయట వ్యర్థాల పారబోతను దురాచారంగా భావిస్తున్న జనం
- పరిశుభ్రంగా మారిన గ్రామాలు
- ఫలితాల సాధన దిశగా వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు



పెండ్లిమడుగులో చెత్తతో వర్మికంపోస్టు తయారు చేస్తున్న సిబ్బంది

వికారాబాద్: 'మీ వాడకు చెత్త బండి వచ్చింది.. తడి, చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వండి.. చెత్తను ఆరుబయట వేయకూడదు.. వేసిన వారికి జరిమానా విధించబడును'.. అంటూ రెండుమూడేళ్లుగా గ్రామాల్లో నిత్యం ప్రచారం చేస్తున్నారు. చెత్త సేకరించే వాహనాలకు మైకులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ప్రజల్లో చైతన్యం వచ్చింది. గతంతో పోలిస్తే చెత్త డంపింగ్‌పై జనం బాధ్యతగా వ్యవహరిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆరు బయట చెత్త వేయడాన్ని సామాజిక దురాచారంగా భావిస్తున్నారు. ఇది త్వరలోనే మంచి మార్పునకు నాంది పలుకుతుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మూడేళ్ల కాలంగా పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల పేరుతో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించిన ప్రభుత్వం ఇందుకు అవసరమైన వసతులు, సౌకర్యాలను కల్పిస్తోంది. ఇందులో భాగంగానే చెత్త సేకరణకోసం పంచాయతీలకు ట్రాక్టర్ల అందజేత, ప్రతీ గ్రామ పంచాయతీలో సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల ఏర్పాటు, తడి, పొడి చెత్తను వేరు చేయడం.. వేరు చేసిన చెత్తతో వర్మికంపోస్టు ఎరువుల తయారీ వంటి కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తున్నారు. ఫలితంగా గతంలో చెత్త కుప్పలు, మురుగు నీటి గుంతలతో దర్శనమిచ్చే పల్లెలు.. ప్రస్తుతం పారిశుద్ధ్యంలో భేష్ అనిపించుకుంటున్నాయి. గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు సైతం ఎప్పటికప్పుడు చెత్త నిర్వహణపై తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతి జీపీలో యూనిట్లు

పారిశుద్ధ్య కార్యక్రమాలపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో మొత్తం 566 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో మూడు మినహా 563 జీపీల్లో ఇప్పటి వరకు సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (డంపింగ్ యార్డులు) యూనిట్లు ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. చెత్త పోగు చేసేందుకు, తరలించేందుకు జిల్లాలోని 566 గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. ప్రతీ జీపీలో గ్రామ జనాభా ఆధారంగా ఒకరి నుంచి నలుగురి వరకు పారిశుద్ధ్య కార్మికులను నియమించి చెత్త సేకరణ, మురుగు కాల్వలను శుభ్రపర్చడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

పారిశుద్ధ్య కార్యక్రమాలపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపిస్తున్నాయి. ప్రతీ గ్రామంలో ఫాగింగ్ చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు 200 పంచాయతీల్లో ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. వీటితో జీపీలను క్లస్టర్లుగా విభజించి అన్ని గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని నిర్ణయించారు. త్వరలో మిగతా 366 జీపీలకు సైతం మిషన్లు కొనుగోలు చేసి గ్రామాల్లో దోమల నివారణ కోసం చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్ శాఖ భావిస్తోంది.

అందరి సహకారంతోనే సాధ్యం



ప్రజల సహకారంతోనే స్వచ్ఛ గ్రామాలను సాధించుకోగలం. చెత్త నిర్వహణను ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలి. సొంత ఇంటిని, నివసిస్తున్న కాలనీలను శుభ్రంగా ఉంచుకుంటే గ్రామాలన్నీ పరిశుభ్రంగా మారుతాయి. వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై దృష్టిసారించాం. దీనినుంచి వర్మికంపోస్ట్ తయారు చేయిస్తాం. ఇది నిరంతర ప్రక్రియ కొద్ది రోజులు చేసి వదిలేసేది కాదు.

– తరుణ్‌కుమార్, డీపీఓ

ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి

వికారాబాద్ అర్బన్: ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ఎస్.శంకర్ తెలిపారు. ఇందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 15 నుంచి ఎగ్జామ్స్ ప్రారంభమవుతాయని స్పష్టంచేశారు. స్థానిక జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల రికార్డులను సక్రమంగా పరిశీలించాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాలను సంబంధిత లాగిన్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. కమిటీ మెంబర్లు రాజమోహన్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



పరిగి సబ్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

కరెంటు కోతలపై కన్నెర్ర

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో పరిగి సబ్ స్టేషన్ ఎదుట నిరసన
- వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్

పరిగి: రైతులకు నిరంతర విద్యుత్ అందజేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. సరైన సమయంలో కోతలు విధించడం ఎంతవరకు సమంజసమని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పరిగి సబ్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా సాగుకోసం నిరంతర ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పిన పాలకులు క్షేత్ర స్థాయిలో కర్షకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం 9 గంటల కరెంటు కూడా సక్రమంగా రావడం లేదని తెలిపారు. దీంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి రైతులు నష్టపోతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల సంక్షేమం కోసం, వారి పక్షాన నిరంతరం పోరాడుతామని స్పష్టంచేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే రైతులకు అన్ని విధాలుగా న్యాయం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ హయంలోనే పరిగి నియోజకవర్గానికి 8 సబ్‌స్టేషన్లు మంజూరైనా ఇప్పటికీ శంకుస్థాపనకు నోచుకోలేదని అసహనం వ్యక్తంచేశారు. నజీరాబాద్‌లో 220 కేవీ సబ్ స్టేషన్‌ను మంజూరు చేయిస్తే ఇప్పటి వరకు పునాది రాయి వేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పరిగిలో విండ్ పవర్, సోలార్ పవర్‌ను తీసుకువచ్చామని స్పష్టంచేశారు. రైతులకు మెరుగైన, నిరంతర విద్యుత్ ఇచ్చేవరకూ పోరాడుతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, ఆయా మండలాల అధ్యక్షులు పరశురాం రెడ్డి, ఆంజనేయులు, సురేందర్, అనెం ఆంజనేయులు, చిన్న నర్సింహులు, వెంకటేశ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.7,800 పలికిన పత్తి ధర



పెద్దేముల్: రెండు రోజులుగా పత్తి ధరలు పెరుగుతున్నాయి. సోమవారం క్వింటాలు ధర రూ.7,850 పలికింది. దీంతో గ్రామాల నుంచి నుంచి పత్తి ఉత్పత్తులు మార్కెట్‌కు చేరుతున్నాయి. నాలుగు రోజులు క్రితం రూ.7,200 నుంచి రూ.7,300 పలకగా రూ.500 పెరిగింది. కానీ రైతులు మాత్రం క్వింటాలుకు రూ.10 చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ధర పెరుగుతుందనే ఆశతో కొంతమంది పంటను ఇళ్లలోనే నిల్వ పెట్టగా.. మరికొంత మంది కూలి డబ్బులు చెల్లించేందుకు, పెట్టుబడి అప్పులు తీర్చేందుకు అమ్ముకుంటున్నారు. పెద్దేముల్ మండలంలోని నాగులపల్లి, మారేపల్లి, పెద్దేముల్, జనగాం, రుద్రారం, గోపాల్‌పూర్, ఇందూరు, మంబాపూర్, కందనెల్లితో పాటు పలు గ్రామాల్లో రైతులు ఈసారి ఎక్కువగా పత్తి పంట సాగు చేశారు.

సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణి ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయొద్దు
- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- కలెక్టరేట్‌లో 251 అర్జీల స్వీకరణ

వికారాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన 251 ఫిర్యాదులను స్వీకరించారు. అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థనలను తీసుకున్నారు. వీటిని వెంటనే క్లియర్ చేయాలని, లేదంటే సరైన కారణాన్ని సూచిస్తూ తన నోటీస్‌లో పెట్టాలని ఆదేశించారు.

బాధ్యతగా పనిచేయండి

మండల కేంద్రాల్లో ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను అర్థం చేసుకొని పూర్తి బాధ్యతతో పరిష్కరించాలని తహసీల్దార్లకు సూచించారు. ధరణి సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్లు, ఆర్డీఓలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కోర్టు కేసులు లేని, క్లియర్ టైటిల్, పొజిషన్‌లో ఉండి ఎలాంటి వివాదాలు లేకుండా ఉన్న ధరణి సమస్యలను తప్పకుండా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సక్సేషన్ కోసం డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అందజేస్తే సరిపోతుందన్నారు.

వివరాలు ఇవ్వండి..

పోడు భూముల సమస్యల పరిష్కారానికి రెండు ఆధారాలతో కబ్జాలో ఉన్న వారి వివరాలను వారం రోజుల్లో జిల్లా స్థాయి కమిటీ ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. గండిపేట మూసీ నది ద్వారా మురుగునీరు గండిపేటలో కలవకుండా చూడాల్సిన అవసరం అధికారులపై ఉందని కలెక్టర్ సూచించారు. జిల్లా నుంచి పారే మూసీ నది ద్వారా గండిపేటకు వెళ్లే నాలుగు నాలాలు కబ్జాకు గురికాకుండా, హద్దులు గుర్తించి పిల్లర్లు వేయించాలన్నారు.

క్యాంటీన్ ప్రారంభం

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. క్యాంటీన్‌లో నాణ్యమైన ఆహారంతో పాటు, స్వచ్ఛమైన తాగు నీరు అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

17వరకు లిటరసీ క్యాంపులు

సరైన ఆర్థిక వ్యవహారాలే మోసపోకుండా కాపాడుతాయని కలెక్టర్ అన్నారు. ఫైనాన్షియల్ లిటరసీ వారోత్సవాల్లో భాగంగా బ్యాంకర్లు ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆర్థిక లావాదేవీల విషయంలో ఖాతాదారులు మోసపోకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు లిటరసీ క్యాంపులు నిర్వహించి, సైబర్ నేరాలు, యాప్‌ల ద్వారా రుణాలపై జాగ్రుతం చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చింతల్ అగర్వాల్, రెవెన్యూ అధికారి అశోక్ కుమార్, ఎల్‌డీఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మందు.. విందు.. చిందు C/O ఫాంహౌస్

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

- శివార్లకు పాకుతున్న పాడు కల్చర్
- పగలు ప్రశాంతం.. రాత్రిళ్లు గానాబజానా
- మత్తులో తూగుతున్న యువత
- పోలీసులు దాడులు చేస్తున్నా పడని అడ్డుకట్ట



మొయినాబాద్: రేవ్ పార్టీలు.. ముజ్రా పార్టీలు.. పేకాట.. రహస్య మంతనాలు.. బేరసారాలు.. హుక్కా, గంజాయి, మద్యం వినియోగం.. ఇలా ఒకటేమిటి అన్నట్టు అసాంఘిక కార్యకలాపాలకు ఫాంహౌస్‌లు వేదికలవుతున్నాయి. ప్రశాంతంగా ఉండే శివారు ప్రాంతాల్లో రాత్రయితే చాలు గానాబజానా.. డీజే చప్పుళ్లు హోరెత్తుతున్నాయి. పోలీసులు నిఘా పెడుతున్నా.. తరచూ దాడులు నిర్వహిస్తున్నా ఆగడాలకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. తాజాగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో శనివారం, ఆదివారం పోలీసులు 32 ఫాంహౌస్‌లపై దాడులు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 22 మందిని అరెస్టు చేశారు. ఒకప్పుడు నగరాల్లోనే కనిపించే పాడు కల్చర్ ఇప్పుడు శివార్లకు విస్తరించింది. చిన్నచిన్న పార్టీల పేరుతో ఫాంహౌస్‌ల్లో ఈవెంట్లు నిర్వహిస్తూ యువతను పెడదారి పట్టిస్తున్నారు.

ఈవెంట్ల పేరుతో..

నగరం శివారు ప్రాంతాల్లో వేల సంఖ్యలో ఫాంహౌస్‌లు ఉన్నాయి. వాటిలో నిత్యం ఏదో ఒక ఈవెంట్ జరుగుతూనే ఉంది. కొన్ని సందర్భాల్లో డ్రగ్స్ సైతం వినియోగిస్తున్నారు. ప్రధానంగా మొయినాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల, శంషాబాద్, కొత్తూరు, షాద్‌నగర్, మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మేడ్చల్, శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్ ప్రాంతాల్లోని ఫాంహౌస్‌ల్లో అసాంఘిక కార్యకలాపాలు అధికంగా కొనసాగుతున్నాయి.

స్థానికులకు ఇబ్బంది

పగలంతా ప్రశాంతంగా ఉండే ఆయా ప్రాంతాలు రాత్రి సమయాల్లో మాత్రం గానా బజానాలు, డీజేల మోతతో ఊగిపోతున్నాయి. చాలా చోట్ల ఫాంహౌస్‌లు జనావాసాలకు అతి చేరువలో ఉండటంతో స్థానికులకు ఇబ్బందిగా పరిణమించింది. ఫాంహౌస్‌ల్లో జరిగే ఈవెంట్లకు వచ్చిన పోకిరీలు మద్యం మత్తులో జనావాసాల్లోకి వచ్చి గొడవలకు దిగుతున్నారు. ఇటీవల మొయినాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో పోకిరీలు అర్ధరాత్రి సమయంలో గ్రామాల్లోకి వచ్చి ఇబ్బందులకు గురిచేశారు. ఇటీవల దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల కొనుగోలుకు సైతం ఫాంహౌసే వేదిక అయ్యింది.

కేసులు నమోదు చేస్తున్నా జాన్తా నై..

నగరానికి చేరువలో ఉన్న ప్రాంతాల్లో ఫాంహౌస్‌లు ఏర్పాటు చేసి వాటిని ఆన్‌లైన్ ద్వారా అద్దెకు ఇస్తున్నారు. ఏదైనా వేడుక చేసుకోవాలనుకున్న వారు ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకుంటారు. మద్యం వినియోగిస్తే ఎక్సైజ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే మద్యం, హుక్కా, గంజాయిని సైతం వినియోగిస్తున్నారు. ఫాంహౌస్‌లపై పోలీసులు అప్పుడప్పుడు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నా పూర్తిస్థాయిలో మాత్రం అరికట్టలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

వేడుక ఏదైనా అనుమతి తప్పనిసరి



ఫాంహౌస్‌లలో పార్టీలు, ఈవెంట్లు ఏవి నిర్వహించినా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. మద్యం వినియోగిస్తే దానికి సంబంధించి ఎక్సైజ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. చిన్న చిన్న వేడుకలు, పార్టీలు జరిగితే ఫాంహౌస్ యజమానులు ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. వేడుకల్లో మాదకద్రవ్యాలు వినియోగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– డీకే లక్ష్మీరెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్

ఫాంహౌస్‌పై పోలీసుల దాడి

- హుక్కా, మద్యం స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఓ ఫాంహౌస్‌పై ఎస్‌ఓటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని కనకమామిడి రెవెన్యూలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై లింగ్యా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం .. కనకమామిడి రెవెన్యూ పరిధిలోని కేతిరెడ్డిపల్లి రోడ్డు పక్కన ఉన్న బిగ్‌బాస్ ఫాంహౌస్‌లో ఆదివారం అర్ధరాత్రి హుక్కా, మద్యం వినియోగిస్తూ పార్టీ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమచారం అందింది. దీంతో ఎస్‌ఓటీ పోలీసులు, మొయినాబాద్ పోలీసులు సంయుక్తంగా ఫాంహౌస్‌పై దాడి చేశారు. పది హుక్కా ప్యాకెట్లు, 12 బీరు బాటిళ్లు, 7 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈవెంట్ నిర్వాహకుడు ఉప్పల్‌కు చెందిన బీబీ స్వామి, ఫాంహౌస్ వాచ్‌మన్ గుల్బర్గాకు చెందిన అబ్దుల్ మజీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఫాంహౌస్ యజమాని ముతవల్లి పరారయ్యాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పోలీసులు దాడి చేసిన ఫాంహౌస్

క్లుప్తంగా

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

పూడూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మంచన్‌పల్లిలో నిర్వహించిన బీరప్ప జాతరలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జడ్పీటీసీ మేఘమాల, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

షాద్‌నగర్ రూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్, షాబాద్, కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో ఫెడరేషన్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, రాష్ట్ర కార్యదర్శి శాంతకుమారి హాజరై మాట్లాడారు. 8 సంవత్సరాల నుంచి విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు లేక నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాల వల్లే ఇటీవల షెడ్యూల్ రావడం జరిగిందన్నారు. పాఠశాలల్లో నియామకాలు లేకపోవడంతో పేద విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయలేక పోతున్నాయని అన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ మున్సిపల్ ఎయిడెడ్, గురుకులాలు, మోడల్స్ స్కూల్‌గా వివిధ యాజమాన్యాల కింద పని చేస్తున్నాయని అన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తుందని ఆరోపించారు. ధనిక రాష్ట్రమని చెపుతున్న తెలంగాణలో ఒకటో తేదీన వేతనాలు పొందలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగం సమస్యలపై టీఎస్ యూటీఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ఫెడరేషన్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, అరుణ, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గీత కార్మికుడికి గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి కింద పడడంతో గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పోల్కంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పల్సం యాదయ్య గీత కార్మికుడు. రోజు లాగే తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా కాలు జారి చెట్టు పైనుంచి కింద పడ్డాడు. తోటి కార్మికులు యాదయ్యను ఇబ్రహీంపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

‘మధ్యాహ్న’ కార్మికులకు ఊరట

- గౌరవ వేతనం పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు
- రూ. వెయ్యి నుంచి రూ. 3వేలకు పెంపు
- జిల్లాలో 1,646 మందికి లబ్ధి



భోజనానికి ముందు ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వడ్డించే కార్మికులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. జనవరి మాసంలో మధ్యాహ్న భోజన బిల్లులు పెంచగా, ఇటీవల కార్మికుల గౌరవ వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కార్మికులకు కొంత ఊరట కలిగింది. సుమారు ఏడేళ్ల తరువాత కార్మికుల గౌరవ వేతనం రూ. వెయ్యి నుంచి 3వేలకు పెంచడంతో వారికి కొంత ఉపశమనం లభించింది. ఈ డబ్బులను నేరుగా నిర్వాహకుల ఖాతాల్లో పబ్లిక్ ఫైనాన్షియల్ మెనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా జమ చేయనున్నారు. పెంచిన డబ్బులను ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటుండడంతో కార్మికులకు కొంత వెసులుబాటు లభించనుంది.

పెరిగిన ధరలు ఇలా

చాలా రోజుల తరువాత మధ్యాహ్న భోజన పథకానికి చెల్లించే బిల్లులను ప్రభుత్వం పెంచింది. గతంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ. 4.97 చెల్లించే వారు. ప్రస్తుతం రూ. 5.46కి పెంచారు. గతంలో ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 7.45 చెల్లించే వారు. ప్రస్తుతం రూ. 8.17కి పెంచారు. 9 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ. 9.95 చెల్లించే వారు. ప్రస్తుతం రూ. 10.67లకు పెంచారు.

861 పాఠశాలల్లో ఏజెన్సీలు

జిల్లా వ్యాప్తంగా 1,030 పాఠశాలలు ఉండగా 861 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నారు. మరో 169 పాఠశాలల్లో అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఈ రెండు కలిపి సుమారు 62వేల మంది విద్యార్థులకు ప్రతి రోజు మధ్యాహ్న భోజనం అందుతోంది.

పెరిగిన వేతనం

పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా గౌరవ వేతనం పెంచాలని మధ్యాహ్న భోజన కార్మికులు అనేక సార్లు ఆందోళనకు దిగారు. గత అసెంబ్లీ సమావేశాల సమయంలో వారి గౌరవ వేతనం రూ. వెయ్యి నుంచి రూ. 3వేలకు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ అమలు కాలేదు. ప్రస్తుతం కార్మికులకు గౌరవ వేతనం పెంచింది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని 1,646 మంది మధ్యాహ్న భోజన కార్మికులకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే మధ్యాహ్న భోజన బిల్లులను పెంచుతున్నట్లు విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు వచ్చాయి. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి మార్గదర్శకాలు రాగానే గౌరవ వేతనాలను అందిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో మొత్తం పాఠశాలలు	1,030
ఎండీఎం ఏజెన్సీలు	861
అక్షయ పాత్ర స్కూళ్లు	169
మధ్యాహ్న భోజన కార్మికులు	1,646

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

పరిగి డీఎం పవిత్ర



పరిగి - శ్రీశైలం బస్సును ప్రారంభిస్తున్న డీఎం పవిత్ర, పాల్గొన్న సిబ్బంది

పరిగి: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని, ప్రతి ఒక్కరూ ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పరిగి డీఎం పవిత్ర సూచించారు. సోమవారం పరిగి నుంచి శ్రీశైలానికి బస్సును ప్రారంభించారు. బస్సులోని ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు, శివస్వాములు అధిక సంఖ్యలో శ్రీశైల దర్శనానికి వెళుతుంటారని, వారు ఇబ్బందులు పడరాదనే ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10గంటలకు పరిగి నుంచి శ్రీశైలానికి బస్సు బయలు దేరుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీకి గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

- ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు విచారణ
- తాండూరులో ముదురుతున్న రాజకీయం

తాండూరు: పరిగి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌ను మంగళవారం పోలీసు అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. యాలాల మండలంలో గత నెలలో ఓ దళిత యువకుడిపై మాలధారణ చేసిన శివస్వాములు పోలీస్‌స్టేషన్‌లో దాడి చేశారు. ఈ ఉదంతంపై మురళీకృష్ణగౌడ్ శివస్వాములను ప్రేరేపించారంటూ అరెస్టు చేసి జైలుకు తరలించారు. అయితే పక్షం రోజుల్లో అప్పీలుకు వెళ్లే అవకాశం ఉంది. ఈ క్రమంలో పోలీసు శాఖ అధికారులు మురళీకృష్ణను కస్టడీలోకి తీసుకొని విచారణ చేస్తామని కోర్టుకు విన్నవించారు. మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకు పోలీసు కస్టడీకి అనుమతి ఇచ్చింది. మురళీకృష్ణ తరపు న్యాయవాది సమక్షంలోనే విచారణ పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చింది. కాగా 8 గంటల పాటు పోలీసు అధికారులు మురళీకృష్ణను కస్టడీలోకి తీసుకొని ఏ అంశాలపై చర్చిస్తారనే చర్చ జోరుగా సాగుతోంది. ఓ గ్రామంలో ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన గొడవ చినికి చినికి గాలివానలా మారి రాజకీయాల వైపునకు మళ్లింది. కస్టడీలోకి తీసుకుంటే మరో పక్షం రోజుల వరకు బెయిల్ రాకపోవడంతో పాటు వచ్చే ఎన్నికల సమయంలో మురళీకృష్ణ తాండూరులో ఉండకుండా చేసేందుకే అధికార పార్టీ నేతలు చేస్తున్నారంటూ రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

మహిళ అనుమానాస్పద మృతి



శివలీల మృతదేహం

మోమిన్‌పేట: అనుమానాస్పద స్థితిలో ఓ దివ్యాంగురాలు బావిలో శవమై కనిపించింది. ఈ సంఘటన మోమిన్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఏన్కతల గ్రామానికి చెందిన సందనెల్లి శివలీల(35)దివ్యాంగురాలు. ఆదివారం శివలీల అక్క సందనెల్లి అమృతమ్మ కూలి పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత చెల్లెలు ఎక్కడికి వెళ్లిందని తన తల్లిని అడిగింది. దివ్యాంగుల సమావేశం ఉందని వెళ్లినట్లు చెప్పింది. అక్కడికి వెళ్లి అడగ్గా సమావేశానికి రాలేదని అక్కడి వారు తెలిపారు. శివలీల ఆచూకీ కోసం పలుచోట్ల వెతికారు. సోమవారం ఉదయం బస్టాండు వద్ద శివలీల గురించి ఆరా తీశారు. ఇదే గ్రామానికి చెందిన యాదయ్య తన బైకుపై శివలీలను ఎక్కించుకెళ్లినట్లు తెలుగు అమృతమ్మ అనే మహిళ తెలిపింది. దీంతో వారు యాదయ్య ఇంటికి వెళ్లి అడిగారు. శివలీలను తాను బైక్‌పై తీసుకెళ్లింది నిజమేనని, కానీ అర్కతల, ఏన్కతల గ్రామాల శివారులో విడిచిపెట్టినట్లు తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆ గ్రామాల సమీపంలో వెతికారు. పక్కనే ఉన్న కొండయ్య బావిలో శివలీల శవమై కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తన చెల్లెలు మృతికి యాదయ్యే కారణమని మృతురాలి అక్క అమృతమ్మ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశం తెలిపారు. ఇదిలా ఉండగా యాదయ్య శివలీలను తీసుకెళ్లే సమయంలో కల్లు కొనుక్కొని వెళ్లినట్లు తెలిసింది. తాగిన మైకంలో హత్యచేసి ఉంటాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. యాదయ్య కూడా దివ్యాంగుడే కావడం విశేషం.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నేతలు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రూప్‌సింగ్ తండా శివాలయ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. భక్తితో ముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, నాయకులు అనార్ సింగ్, గోపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కుల్కచర్ల పోలీసులు సీజ్ చేశారు. చౌడాపూర్ గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి ఆపారు. డ్రైవర్ వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఆయనపై కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్‌ఐ గిరి హెచ్చరించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ మహరాజ్

పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్

బషీరాబాద్: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పార్టీ సీనియర్ నాయకుడు, పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి జరిగిందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఏ వర్గానికి న్యాయం జరగలేదన్నారు. ఒక్క గ్రామంలో కూడా పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. రైతు రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే మాటలు తప్పా చేతలు చేతలు శూన్యమని అన్నారు. బీఆర్‌ఎస్ పట్ల ప్రజల్లో, ఉద్యోగుల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రతి గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. ప్రభుత్వ మెడలు వంచి సమస్యలు పరిష్కరించేందుకే హాత్ సే హాత్ జోడో యాత్ర చేపట్టినట్లు చెప్పారు. అనంతరం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాకేష్ మహరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే తాండూరు అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉత్తమ్ చంద్, శంకరప్ప, మాధవ్ రెడ్డి, నవల్గా నర్సింహులు, లక్ష్మణ్, రాజవర్ధన్‌రెడ్డి, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి అండగా నిలవాల్సిన సమయం

యాలాల: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలు అండగా ఉండాల్సిన సమయమని, పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేదాకా విశ్రమించరాదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం యాలాల మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. పెద్ద నోట్ల రద్దు, పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, పెట్రో ధరలు, మతాల మధ్య గొడవలతో బీజేపీ పట్ల వ్యతిరేకత ఉందన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ రుణమాఫీ, ధరణి సమస్యలు, హామీ అమలుకు నోచుకోని డబుల్ బెడ్ రూం పథకం లాంటి వాటితో ప్రజలు చీదరించుకుంటున్నారని అన్నారు. ఈ విషయంలో కార్యకర్తలు, నాయకులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల పోరాటానికి సిద్ధం కావాలన్నారు. రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ తప్పక అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బషీరాబాద్ మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహరాజ్ తిరిగి పార్టీలోకి రావడం శుభపరిణామమన్నారు. తాండూరు ఎమ్మెల్యేగా ఈసారి తప్పక పోటీలో ఉంటానని, ఈ ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతామన్నారు. త్వరలో గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి హాత్ సే హాత్ జోడో యాత్ర చేపడతామన్నారు. కార్యక్రమంలో బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు భీమప్ప, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆవుటి రాజశేఖర్, సీనియర్ నాయకులు నీలకంఠం, బస్వరాజ్, వీరేశం, ఉత్తం చంద్, నర్సిరెడ్డి, ప్రశాంత్ కుమార్, గంతల మైనొద్దీన్, చంద్రశేఖర్‌గౌడ్, వడ్ల శ్రీనివాస్, దేవనూరు ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

యాలాల: ఉపాధ్యాయుల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని అగ్గనూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎన్నో జీఓలను అమలయ్యేలా చూసిన ఘనత పీఆర్‌టీయూకే దక్కుతుందన్నారు. మహిళ ఉపాధ్యాయులకు అదనంగా సీఎల్‌లు, బదిలీలలో కౌన్సిలింగ్ విధానం, పైరవీలకు తావులేకుండా ఉపాధ్యాయులు తామే స్వయంగా బదిలీ ఉత్తర్వులు పొందేలా పద్ధతి తీసుకువచ్చామని తెలిపారు. సమ్మె కాలంలో పూర్తి వేతనం, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు 010 పద్దు నుంచి ట్రెజరీ వేతనాలను అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. మహిళ ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్‌లు, అప్రెంటీస్ కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు, ఫ్యామిలీ పెన్షన్, డెత్ గ్రాట్యూటీ లాంటి సమస్యలు పరిష్కరించిన సంఘంగా గుర్తింపు పొందిందన్నారు. తమ సంఘం బలపరిచిన మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ స్థానాల ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, సంఘం నేతలు కల్లూరి వెంకట్‌రెడ్డి, మొగులయ్య, పరమేష్, మహమూద్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్లెదుటే నీట మునిగిన తండ్రి

- నిస్సహాయ స్థితిలో కుమారుడు
- చేపలు పడుతుండగా ప్రమాదం



మహమూద్ (ఫైల్)

దౌల్తాబాద్: కళ్ల ఎదుటే తండ్రి నీటిలో మునిగిపోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కుమారుడి ఆవేదన వర్ణనాతీతం. తనకు జన్మనిచ్చిన తండ్రిని కాపాడాలని ఉన్నా.. ఈత రాకపోవడంతో బోరున విలపించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఈర్లపల్లికి చెందిన మహమూద్(45), తన 18 ఏళ్ల కుమారుడు లాల్‌సాబ్‌తో కలసి సోమవారం సాయంత్రం గ్రామ పరిధిలోని యాసల్ గడ్డ బావిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో మహమూద్ బావిలో మునిగిపోయాడు. ఎంతకీ పైకి రాకపోవడంతో కుమారుడు లాల్‌సాబ్ ఆందోళనకు గురయ్యాడు. తండ్రిని కాపాడడానికి బావిలోకి దిగాలని భావించాడు. కానీ తనకు ఈత రాకపోవడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో అక్కడే ఉండిపోయాడు. తన తండ్రిని కాపాడాలని కేకలు వేశాడు. చుట్టు పక్కల ఎవరూ లేకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. గ్రామానికి పరుగెత్తుకెళ్లి బాబాయ్‌ని బావి వద్దకు తీసుకెళ్లాడు. కానీ ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బావి వద్దకు చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు గాలింపు కొనసాగింది. కానీ ఫలితం లేకపోవడంతో మరో సారి గాలింపు చర్యలు చేపట్టారు.

నిరుద్యోగులను నిండా ముంచిన సీఎం

- ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతికి మొండిచేయి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న సదానందరెడ్డి

ధారూరు: తమ ప్రభుత్వం ఏర్పాటైతే ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి కల్పిస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం కేసీఆర్, కేటీఆర్‌లు నిరుద్యోగులకు నిండా ముంచారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్ ఆరోపించారు. ప్రజాగోస - బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం ధారూరు మండలం అల్లిపూర్, ఎబ్బనూర్ గ్రామాల్లో శక్తికేంద్రం ఇన్‌చార్జ్ వెంకటేశ్‌గౌడ్ అధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ టూ పీజీ ఉచిత విద్య, నిధులు, నీళ్లు వస్తాయని ఆశతో ఉన్న ప్రజలు, రైతులకు కేసీఆర్ తమ కుటుంబ సభ్యులతో పదవులను అనుభవిస్తూ మోసం చేశారని ఆరోపించారు. బంగారు తెలంగాణ తెస్తామని చెప్పి అప్పుల తెలంగాణ చేయడంతో పాటు కుటుంబ పాలన కొనసాగిస్తున్నారని వారు విమర్శించారు. గ్రామాలు, తండాల్లో ఎక్కడపడితే అక్కడ బెల్టు షాపులను పెట్టించి ప్రజల సంపదను దోచుకుంటూ జనాన్ని తాగుడుకు బానిసలుగా మార్చారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ మోసాలను ప్రజలకు వివరించేందుకే బీజేపీ చేపట్టిందని వారు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరోత్తమ్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, శ్రీధర్ పాల్గొన్నారు.

సదుపాయాలకు మంగళం

ఉపాధి కూలీలకు ఐదేళ్లుగా అందని పరికరాలు

- పని ప్రదేశంలో నీడ కరువు
- పట్టించుకోని అధికారులు
- ఎండలో ఇబ్బందులు పడుతున్న కూలీలు



మమ్మదాన్‌పల్లిలో ఎండలో పని చేస్తున్న ఉపాధి కూలీలు

నవాబుపేట: జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు పని చేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. వేసవి సమీపిస్తున్నా నిబంధనల ప్రకారం కల్పించాల్సిన వసతులపై మాత్రం అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. ఇప్పటికే ఎండ తీవ్రత పెరగడంతో పనులు చేసేందుకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పని ప్రదేశాల్లో గుడారాలు ఏర్పాటు చేసే వారు. తాగునీటి వసతి, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచే వారు. పని లేని సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి వసతి లేక కూలీలు తంటాలు పడుతున్నారు. ఉపాధి పనులు నడుస్తున్న ప్రదేశాల్లో కూలీలకు నీడ కోసం గ్రీన్ షేడ్ నెట్లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు. దీంతో తప్పని పరిస్థితు ల్లో మండుటెండలోనే కూలీలు పనులు చేయాల్సి వస్తోంది. కనీస వసతులు లేకపోవడంతో పాటు బిల్లులు చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూ పడం లేదు. నవాబుపేట మండలంలో 8,510 జా బ్ కార్డులు ఉండగా ప్రతి సారి పనులకు వచ్చే వారి జాబ్ కార్డులు 6510 ఉన్నాయి. ప్రస్తుతం 1000 పైగా కూలీలు ఉపాధిహామీ పనులు చేస్తున్నా రు. ఈ సంఖ్య ఇంకా చాలా పెరగాల్సి ఉంది. ప్రస్తు తం వ్యవసాయ పనులు చివరి దశలో ఉండడంతో కూలీ లు తక్కువగా వస్తున్నారు. వ్యవసాయ పను లు పూర్తి కాగానే 6000లకు పైగా కూలీలు పనులకు వస్తారు.

ఐదేళ్లుగా అందని పరికరాలు

ఉపాధి కూలీలకు ఐదేళ్లుగా పార, గడ్డపార, తట్టలు తదితర సామగ్రి అందడం లేదు. కూలీలు సొంతంగా వాటిని సమకూర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతుండడంతో కూలీలు తాగునీటిని వెంట తీసుకెళుతున్నారు. పని చేసే సమయంలో ఎండ తీవ్రత తట్టుకోలేక సమీపంలో ఎక్కడ చెట్లు కనిపించినా వాటి నీడన సేదతీరుతున్నారు. కూలీలకు చిన్న పిల్లలు ఉంటే వారిని ఆడించేందుకు ఆయాలను కూడా నియమించేవారు. ప్రస్తుతం ఆయా వ్యవస్థనే తీసివేశారు. దీంతో చిన్న పిల్లలు ఉన్న కూలీలు పనులకు రావడం మానేశారు.

కూలీ రేట్లు పెంచాలి

ఉపాధిహామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు కూలి గిట్టుబాటు కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. రోజుకు ఒక్క కూలీకి రూ. 257 అందించాల్సి ఉండగా రూ.150 నుంచి 200 వరకే వస్తున్నాయని అంటున్నారు. పని చేసే కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించి రోజుకు రూ. 500 చొప్పున కూలి చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి సరఫరా లేదు

ఉపాధి హామీలో పనులు చేసే కూలీలకు గతంలో మెడికల్ కిట్లు, గడ్డపార, తట్టలు, వేసవిలో సేదతీరడానికి గ్రీన్ షెడ్ నెట్లను ప్రభుత్వం పంపిణీ చేసేది. కొంత కాలంగా వాటిని సరఫరా చేయడం లేదు. వస్తాయా రావా అనే సమాచారం కూడా లేదు.

– సుమిత్రమ్మ, ఎంపీడీఓ, నవాబుపేట